

# రాజగోపాల్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలి



సంస్థాన్‌నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

- బీజేపీకి ఓటు వేస్తే మోటర్లకు మీటర్లు తప్పవు
- టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)తోనే సంక్షేమం, అభివృద్ధి
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- లచ్చమ్మగూడేనికి చెందిన టీడీపీ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరిక

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 9 : మునుగోడు ఉప ఎన్నికలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లచ్చమ్మగూడెం, చిల్లాపురం, డాకుతండా, కొర్రతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లతో పాటు మోదీ సర్కార్ రూపొందించిన విద్యుత్ సంస్కరణలు, వ్యవసాయ చట్టాలు వస్తాయని హెచ్చరించారు. అంతేకాకుండా ఇప్పటికే పెరిగిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలతో కుదేలవుతున్న సామాన్యుడి మీద పెనుభారం మోపేందుకు బీజేపీ సర్కార్ ప్రణాళికలు రూపొందించిందన్నారు. సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణ పథకాలను దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమన్నారు. అది మునుగోడు నియోజకవర్గ ప్రజల భాగస్వామ్యంతోనే ప్రారంభం కావాలన్నారు. మునుగోడులో ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నిక రాజగోపాల్‌రెడ్డి సొంత ప్రయోజనం కోసమే వచ్చింది విమర్శించారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని రాజగోపాల్‌రెడ్డి రూ.18 వేల కోట్లకు అమ్ముకున్నాడని మండిపడ్డారు. మునుగోడు అభివృద్ధి కోసం రాజగోపాల్‌రెడ్డి ఏ ఒక్క రోజూ ప్రయత్నం చేయలేదని అన్నారు. దేశం చూపంతా తెలంగాణ వైపు ఉన్నదని పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా లచ్చమ్మగూడెంలో టీడీపీకి చెందిన నాలుగు కుటుంబాలు టీఆర్‌ఎస్‌లో చేరాయి. వారికి ఆమె గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య, సర్పంచులు జెన్నాయికోడె అలివేలు, దోటి మంజుల, లచ్చిరాంనాయక్, టీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



చొప్పరివారిగూడెంలో మహిళలతో మాట్లాడుతున్న పాల్వంచ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

# టీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజా సమస్యలు పరిష్కారం

- పాల్వంచ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

చండూరు, అక్టోబర్ 9: టీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లోని ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పాల్వంచ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చొప్పరివారిగూడెం, గుండ్రపల్లి, చామలపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఆవాస గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్) కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి మునుగోడు ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధావెంకన్న, యువజన విభాగం మండలాధ్యక్షుడు ఉజ్జిని అనిల్‌రావు, ఉప సర్పంచ్ రమేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకర్, వెంకటేశ్, రమేశ్, లింగస్వామి, అరుణాచలం, వెంకన్న, గిరి, హరికృష్ణ, లింగయ్య, సత్తయ్య, హరిచంద్ర పాల్గొన్నారు.

# టీఆర్‌ఎస్‌కే కార్మికలోకం జై

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నది. ఆటో డ్రైవర్లు, వర్కింగ్ జర్నలిస్టులు, హోంగార్డులకు ప్రమాద బీమా కింద రూ.5లక్షల ఆర్థిక సాయం ఇస్తున్నది. తెలంగాణ అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత పథకంలో భాగంగా రూ. 2లక్షల ప్రమాద బీమా అందిస్తున్నది.

### కార్మికుల ఉపాధి, సంక్షేమంపై కేంద్రం దెబ్బ..

రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను అన్నివిధాలుగా ఆదుకుంటుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి బతుకులను ఆగం చేస్తున్నది. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ వారి పొట్టగొడుతున్నది. కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నది. హక్కులను కాలరాస్తున్నది. అడ్డమైన చట్టాలను తీసుకొస్తూ నిలువునా ముంచుతున్నది. పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నది. ప్రైవేట్‌కు అమ్మేస్తున్నది. దీంతో కార్మికులు ఉపాధి, సంక్షేమంపై దెబ్బకొడుతున్నది. కేంద్రం రోడ్డు రవాణా సవరణ చట్టాన్ని తీసుకొచ్చి కార్మికుల కుటుంబాలను రోడ్డుపైకి నెట్టుతున్నది. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తున్నది. గతంలో ఉన్న 44 చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు నల్ల చట్టాలను తీసుకొచ్చింది. కొత్త చట్టాల ప్రకారం రోజుకు 12 గంటలైనా పనిచేయించుకో వచ్చనే పనికిమాలిని నిబంధనలు తీసుకొచ్చింది.

### మంచి మనసున్న సర్కారు..



కార్మికుల సంక్షేమానికి టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నది. మా బాధలను అర్థం చేసుకొని ఎన్నో పథకాలు, కార్యక్రమాలను తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సక్రమంగా అమలు చేస్తున్నది. అందుకే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుంటాం.

– తడకమళ్ల లక్ష్మి, కార్మికురాలు, చౌటుప్పల్

# రైతుల రందీ తీర్చిన ఘనత టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)దే

- కూసుకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి




నాంపల్లి : తుమ్మలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

నాంపల్లి, అక్టోబర్ 9 : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధుతో రాష్ట్రంలో రైతుల రంది తీరిందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తుమ్మలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమైక్య పాలనలో రైతులు పంటలను అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయించాల్సి వచ్చేదని, స్వరాష్ట్రంలో రైతుల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్స(బీఆర్‌ఎస్)ప్రభుత్వంలోనే అనేక సాగునీటి ప్రాజెక్టులు కట్టినట్లు గుర్తుచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంట్రాక్టుల కోసం అమ్ముడుపోయినందునే మునుగోడుకు ఉప ఎన్నిక వచ్చిందని, ఎన్నికలో ఓటర్లు ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. అధికార పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్) మండలాధ్యక్షులు గుమ్మడపు నర్సింహారావు, సురేందర్ రెడ్డి, సర్పంచులు కులుకులపల్లి చెన్నయ్య, అన్నెపాక కిరణ్, గుమ్మడపు రామేశ్వర్‌రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసే టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)లో చేరికలు

- దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



కాంగ్రెస్ నాయకులను టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

నాంపల్లి, అక్టోబర్ 9 : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమానికి ఆకర్షితులయ్యే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని రేఖ్యాతండా, వస్రాంతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 30 మంది ఆయన సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లు రావడమే కాకుండా, మోదీ సర్కారు రూపొందించిన విద్యుత్ సంస్కరణలు, వ్యవసాయ చట్టాలు వస్తాయని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమన్నారు. అది మునుగోడు ప్రజల భాగస్వామ్యంతోనే ప్రారంభం కావాలన్నారు. మునుగోడు ఉప ఎన్నిక ప్రజల అవసరం కోసం వచ్చింది కాదని, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సొంత ప్రయోజనం కోసం వచ్చిందని అన్నారు. రూ.18వేల కోట్ల కాంట్రాక్టులు తీసుకున్నానని రాజగోపాల్‌రెడ్డి ఒప్పుకున్న విషయాన్ని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు రమావత్ శంకర్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే గులాబీ గూటికి..

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



దండుమల్కాపురం సర్పంచ్ ఎలువర్తి యాదగిరికి గులాబీ కండువా కప్పి టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 9 : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)లోకి వలసలు పెరుగుతున్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దండుమల్కాపురం గ్రామ సర్పంచ్(కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అనుచరుడు) ఎలువర్తి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిసరి బలవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయంగా రైతు బిడ్డ అయిన సర్పంచ్.. మోటర్లకు మీటర్లు పెట్టె బీజేపీకి వ్యతిరేకమని టీఆర్‌ఎస్‌లోకి వచ్చినట్లు తెలిపారు. ఫ్లోరోసిస్ భూతాన్ని ఆరికట్టి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మిషన్ భగరీథ నీటిని టీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్నట్లు గుర్తుచేశారు. దండు మల్కాపురం ప్రజలంతా సీఎం కేసీఆర్ వెన్నంటే ఉన్నారని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, ఎంపీటీసీ చిట్టెంపల్లి శ్రీనివాస్‌రావు, ఆందోళ్ మైసమ్మ చైర్మన్ సిద్దిపేట శేఖర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఈద్దుల మస్తాన్‌బాబు యాదవ్, ఉప సర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ పాల్గొన్నారు.